# ఎల్‌కేజీ ఫీజు మూడు లక్షలు!

**1 ఐఐటీకి రూ. 75 వేలే.. ఢిల్లీలో చదువు భారం**

న్యూఢిల్లీ: దేశరాజధానిలో పిల్లలు చదువు'కొనడం' చాలా భారం అయిపోతోంది. పలు విద్యా సంస్థల్లో ఎల్‌కేజీ ఫీజులు.. ఐఐటీ ఫీజులను తలదన్నేలా ఉండటంతో తల్లిదండ్రులు గగ్గోలు పెడుతున్నారు. ఐఐటీలలో వార్షిక ఫీజు రూ. 50వేలు. అదికాక అడ్మిషన్, పూర్వవిద్యార్థుల సమావేశాలు, హాస్టల్ తదితరాలకు కలిపి మరో రూ. 20వేలు చెల్లించాలి. అంటే, మొత్తం కలిపినా ఏడాదికి రూ.70వేలు దాటదు. కానీ ఢిల్లీ, గుర్‌గావ్ తదితర ప్రాంతాల్లో కొన్ని 'మంచి' స్కూళ్లలో పిల్లలను ఎల్‌కేజీలో చేర్చాలంటే.. సవాలక్ష ప్రశ్నలతో కూడిన ఇంటర్వ్యూలో నెగ్గాలి. తర్వాత అడ్మిషన్ ఫీజు రూ.75 వేలు, వార్షికఫీజు రూ.1.70 లక్షలు, రవాణా చార్జీలు రూ.38-44వేలు, ఐటీ ఫీజు రూ. 6-9.5వేల చొప్పున చెల్లించాలి. అంటే దగ్గర దగ్గర రూ.3 లక్షల వరకు కేవలం ఎల్‌కేజీ ఫీజు కట్టాలి! నోయిడాలోని ఓ స్కూల్లో అడ్మిషన్ ఫీజు రూ.61 వేలు, త్రైమాసిక ఫీజు రూ.26వేలు వసూలుచేస్తోంది. అంటే లక్షన్నర దాటుతుంది. ఢిల్లీ విద్యాశాఖమంత్రి అర్వీందర్ సింగ్ లవ్లీకి ఈ విషయం తెలిసినా.. తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే తప్ప ఏమీ చేయలేమని అంటున్నారు.